

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఉగాది

**ఎదురింటి పాప వాళ్ళమ్మని అడుగుతోంది** "ఎందుకు వేపపువ్వు కోత్తున్నావ్?"

"రేపు ఉగాదమ్మా" అంది వాళ్ళమ్మ.

"అంటే?" పాప ప్రశ్న.

"పండగ"

"పండగ అంటే?"

"పండగ అంటే." వాళ్ళమ్మ ఆలోచించింది. ఏం చెపుతుందోనని నేనూ ఎదురు చూస్తున్నాను.

"టీ.వీ.లో చూపిస్తారే అందరూ పట్టుచీరలు కట్టుకుంటారు. కొత్త సినిమాలు రిలీజ్ అవుతాయి. ఆ హీరోయిన్ ఇంగ్లీషులో 'పండగలంటే ఐ యాం క్రేజీ.. ఐ లైక్ పులిహోరా, గారే, పాయిషం' అంటూ చెప్తూ ఉంటుందీ.."

నేను ఇంక వినలేదు. ఇంట్లోకి వచ్చేసాను. పండగలంటే చివరికి టీ.వీల్లోనే చూడాల్సొస్తోంది. రోజూ ముప్పాతిక నగ్నంగా కేవలం మెడ కింద ఒక అడుగు నుండీ, మోకాళ్ళ పైన ఒక అడుగు వరకూ మాత్రమే దుస్తులు ధరించే అమ్మాయిలు ఆ రోజున పెద్ద పెద్ద పట్టుచీరలు కట్టుకుని, బుట్టెడు పువ్వులు మేకలు వెంట పడేట్లు పెట్టుకుని వస్తారు. ʻమా ఊరి వంటలʻ పుణ్యమా అని ఎవరో సెలబ్రెటీని తెచ్చి లడ్డూలు చెయ్యడం చూపిస్తారు. బజారు నుండి తెచ్చి రంగు వేసిన మోతీచూర్ లడ్డూలు ప్లేటు నిండా పెట్టి, పైన కొబ్బరి కోరూ, దిబ్బా చల్లి ఇక్కడ ఆవిడ పాకం కుదరక అవస్త పడ్తూ తేగుడు తేగుడుగా పాకంతో బూందీ కలిపి లడ్డూ లాంటి ద్రవం చెయ్యడం చూపిస్తుంటారు.

మరీ ఘోరంగా ఒక్కోసారి ఉగాది పచ్చడి చెయ్యడం కూడా చూపిస్తారు.

"స్మాల్ క్వాంటిటీలో వేపపువ్వు, జాగిరీ బాగా గ్రైండ్ చేసి, చిన్న బౌల్‌లోకి తీసుకుని, సాల్ట్, కొంచెం హనీ యాడ్ చేసి, న్యూ టామరెండ్ జ్యూస్ ఆల్‌రెడీ చేసి పెట్టుకున్న దాంట్లో ఇవన్నీ స్మాల్ స్మాల్ క్వాన్‌టిటీస్‌లో వేసి బాగ మిక్స్ చెయ్యాలి."

మా అమ్మ "ఏవిటే ఆ అమ్మాయి చెప్తోంది?" అని అడిగితే ʻటింగ్లీష్ ఉగాది పికిల్ʻ అని చెప్పాను.

ఆవిడ ముక్కున వేలేసుకుంది.

ఉగాది అనగానే నాకు ఎస్.వి.కృష్ణారెడ్డిగారి ఉగాది సినిమాలో అత్యద్భుతంగా ఆయన స్వరపరచిన పాట ఒకటి గుర్తొచ్చింది. కృతికర్త సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు. వెన్నెల అద్దిన అక్షరాలు అలా అలా వాలుగా అమృతం జారుతున్నట్లు పరిగెడ్తుంటాయి.

"కాటుక పిట్టల మాదిరి ఎగిరే కన్నులు రెండూ..

అవి నీ పైనే వాలే నువ్వా కొంచెం గమనించు..
ఇప్పటిదాకా పరిచయమైనా లేకపోవచ్చూ..
అవి ఎప్పటినుండో నీ కోసమనే చూస్తూ ఉండొచ్చూ..
నువ్వురాగానే రెక్కల రెప్పలు చాచి ఎగురవచ్చూ..
'హలో' అంటూ అల్లరిగా నిన్నే పలకరించవచ్చూ..
నువ్వు తీరా అటు చూసేసరికి బిడియం రావచ్చూ.."

ఎంత అందమైన సాహిత్యం? ఇది చేయించుకున్న, రాయించుకున్న దర్శకుడి ప్రతిభని ఏమని పొగుడుతాము?

ఇంత మంచి కవిత్వాన్ని రాయమని కవులని ఉత్తేజపరిచే సంగీత దర్శకులూ, దర్శక నిర్మాతలూ ఏరి?

సరే. ఉగాది అనగానే ఆ పాట గుర్తొచ్చింది. పాట అనగానే సాహిత్యం.. సాహిత్యం అంటే తెలుగూ గుర్తొచ్చాయి.

ఈ మధ్య నాకో విషయం అర్థమైంది. మా తరువాత జనరేషన్‌లో చాలామంది పిల్లలకి తెలుగు వ్రాయడం, చదవడం రాదు. 'లీడర్' అనే నా పుస్తకం ఇంగ్లీషులోకి అనువాదం చేయించడానికి ట్రాన్స్‌లేటర్స్ కోసం ట్రై చేసాను. అందరికీ ఇంగ్లీషు వచ్చు. కానీ ఈ తెలుగు, అదీ నేను పాత పద్ధతిలో కావాలంటాను. అటువంటి తెలుగు వాళ్ళకి అర్థం కావడంలేదు. ముఖ్యంగా 'జీగూడు' అంటే కాలిజోళ్ళు పెట్టుకునే స్థలం అనీ, సత్రం అంటే లాడ్జీలనీ, సహాధ్యాయి అంటే క్లాస్‌మేట్ అనీ 'మధూకరం' అని అప్పుడు భిక్ష అడుక్కునేవారనీ.. ఇవన్నీ వాళ్ళకి బోధపడటం లేదు. అసలు తెలుగులోంచి ఇంగ్లీషులోకి అనువాదం చెయ్యడానికి కావలసిన తెలుగు ఎవరి దగ్గరా సరిపడా లేదు. రెండు భాషల మీద పట్టున్నవాళ్ళు నాకు ఎవరూ దొరకలేదు. ఇంక నా అమెరికా మిత్రుల్ని ఎవరినైనా బతిమాలాలేమో? నిజంగా తెలుగుని కొంత బ్రతికిస్తున్నది అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్రులే అని నాకు రెండు మూడు సందర్భాలలో తెలిసి వచ్చింది.

'తానా' ప్రెసిడెంట్ అయిన సందర్భంలో హైదరాబాద్‌లో తోటకూర ప్రసాద్‌గారికి చేసిన సన్మానంలో ఆయన చేసిన ప్రసంగం విని, ఆ మంచి ఉచ్చారణకి నేను ఆనందించాను. మా ఫణీ డొక్కా, గజేంద్ర మోక్షంలో పద్యాలూ, కూచిపూడికి నృత్యరూపకం రాసినప్పుడు అబ్బురపడ్డాను. అలాగే మా వంగూరి చిట్టెన్ రాజుగారి అమెరికామెడీ కబుర్లలో రాసే అద్భుత తెలుగు నుడికారాలకీ చమత్కారాలకీ ఇంకా ఇంకా ఆశ్చర్యపోతాను. ఎందుకంటే ఆయన నా చిన్నప్పుడు వెళ్ళారు అమెరికా. (వయసు అందరికీ తెలిసిపోతుందని నన్ను కూకలేస్తారని సంవత్సరం రాయడంలేదు) కానీ ఆయన కాకినాడ తెలుగు మారలేదు. అలాగే మా కిరణ్‌ప్రభగారి వేసవిలో చెరుకురసంలాంటి కవిత్వంకూడా.

ఇంక చిన్నపిల్లలు నృత్యం, సంగీతం విధిగా నేర్చుకుంటూ, ఏ తెలుగు సంబరం అయినా, జడగంటలతో, పట్టుపరికిణీ ఓణీలతో, తెలుగుతనం ఉట్టిపడే నగలతో కనువిందుచేస్తున్నారు. నిన్ననే ata2012.orgని ఓపెన్ చేసి చూస్తే, తెలుగు పిండివంటలు ఇప్పటినుండే నోట్లో నీళ్ళు ఊరించేట్లు ఉన్నాయి. నేను ఇందాక రాసినట్లు మనవాళ్ళకి ఆవడలు కావాలి, బొబ్బట్లు కావాలి, పూతరేకులు కావాలికానీ, మినప్పప్పూ, బెల్లం, ఆవాలు, జీలకర్రా, తోపు పిండీ, తిరగమోతా, బాండీలాంటి తెలుగు పదాలు అక్కర్లేదు. పనిమనుషులు కూడా చాలా వరకూ 'ఆంటీ, అంకుల్' అని పిలుస్తూ, ఇంగ్లీషులో "బ్రేక్‌ఫాస్ట్ తయ్యారు చెయ్యమంటారా! డిన్నర్‌కి ఏం చెయ్యనూ?" అనే అడుగుతున్నారు.

మొన్నొక కథ చదివాను "అర్జున్ థింక్ చెయ్యడం బిగిన్ చేసి వన్ అండ్ హాఫ్ అవర్స్ అయింది. షాలినీ తనతో స్పెండ్ చేసే టైంనీ ఆమె షాపింగ్‌లో స్పెండ్ చేసే టైంని కాలిక్యులేట్ చేస్తే చాలా డిప్రెసింగ్‌గా అనిపించింది. ఆఫీస్‌లో కూడా బాస్‌తో రేపో ప్రోపర్‌గా లేదు. ఫ్రస్టేటింగ్‌గా ఫీలు అవుతున్నాడు."

ఇందులో తెలుగు పదాలు లెక్కపెట్టడం అనవసరం. భావం ప్రధానం భాష కాదు. అమ్మమ్మ మాటలు మాట్లాడకు అని ఇప్పటివాళ్ళు నా నోరు మూయించవచ్చు.

ఆ మధ్య (ట్యాంక్ బండ్ దగ్గర విగ్రహాలు పగలకొట్టకముందు) పొట్టి శ్రీరాములు విగ్రహం చూసి "ఈయనెవరు?" అని మా అసిస్టెంటు అడిగితే "పొట్టిశ్రీరాములు" అని చెప్పాను.

"అదేవిటి? పొడుగ్గానే ఉన్నాడే" అన్నాడు ఆ అబ్బాయి.

అలాగే విశ్వనాథ సత్యనారాయణగారిదో గురజాడగారిదో ఫోటో సాహిత్యాభిమానం కొద్దీ లివింగ్ రూం గోడలకి పెట్టుకుంటే "మీ తాతగారా?" అని అడుగుతారే తప్ప ఆ పెద్దమనుషుల్ని వీళ్ళు గుర్తుపట్టరు. అంతెందుకు 'జనగణమణ' రాసిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఫోటో అందరికీ తెలుసు 'మా తెలుగు తల్లికి' రాసిన శంకరంబాడి సుందరాచార్య ఎవరికి తెలుసు?

"కొలవరి కొలవరిడీ" పాడినది ఎవరని అడిగితే 'ధనుష్. రజనీకాంత్ అల్లుడు' అని అప్పుడే మాటలు వస్తున్న మూడేళ్ళ బుడుగు దగ్గరనుండీ ఠక్కున చెప్పేస్తారు.

అప్పుడు ఇంత మీడియా లేకపోవడం వల్లా, యూట్యూబులూ, ఫేస్ బుక్కులూ అస్సలు లేకపోవడం వల్లా, మనభాషా, ప్రాచీన కవులూ ఫేమస్ కాలేకపోయారు. వీళ్ళ గురించి ఎవరూ ట్విట్టర్ లో రాయరు. వికీపీడియాలో అప్‌డేట్ చెయ్యరు.

ఆ మధ్య డా.సూర్యప్రకాష్ అనే డాక్టర్ గారు, శ్రీనగర్ కాలనీలో Raphsody హోటల్‌లో రోజూ ఓ పుస్తకం పరిచయం చెయ్యడం కార్యక్రమం వందరోజులపాటు నిర్వహించారు. అందులో ఒకరోజు నేను 'లీడర్' అని మా తాతగారు ఫ్రీడం ఫైటర్ సూరంపూడి శ్రీహరిరావుగారూ, మా అమ్మమ్మ సూరంపూడి వెంకట రమణమ్మగార్ల గురించి వ్రాసిన పుస్తకం పరిచయం చేసాను. ఆ వంద రోజుల్లో ఒకసారి మా తెలుగు లెక్చరర్ కిళాంబి జ్యోతిర్మయిగారు వచ్చి ఆవిడ డాక్టరేట్ చేసిన 'వసుచరిత్ర' గురించి చెప్పారు. అందులో ఆవిడ సుక్తిమతి అనే నదిని కోలాహలం అనే కొండ బలాత్కారం చేస్తే పుట్టిన గిరిక గురించి చెప్తూ, ఆ బలాత్కార ఘట్టంలోని పద్యాలని చెపుతుంటే, అదేదో తెలీని ఆనంద పారవశ్యంతో ప్రతి ఒక్కరం కన్నీరు కార్చాం. ఆ తరువాత 'నువ్వు రచయిత్రివి కావడం పెద్ద గొప్పేం కాదు, ఇలాంటి గురువులుంటే మేము అయ్యేవాళ్ళం' అని మా గోపాల్రావుగారి లాంటి స్నేహితులు అన్నారు. అదీ ఓ రకం పొగడ్తేకదా! శిష్యుల ముందు గురువుని పొగడినా, గురువు ముందు శిష్యురాలిని పొగిడినా చాలా గర్వంగా ఉంటుంది. అసలు కస్తూరిబా కాలేజ్‌లో బి.ఏ లో నేను సెకెండ్ లాంగ్వేజ్ హిందీ తీసుకుని జ్యోతిర్మయిగారు పాఠం చెపుతున్న గదిముందునుండి వెళుతూ ఆవిడ శ్రావ్యంగా పాడుతున్న పద్యం విని అక్కడి నుండి కదలలేక పోయాను. ఆ తరువాత హిందీ సెకెండ్ లాంగ్వేజ్ అన్నది కొట్టేసి తెలుగు అని రాసుకుని ఆవిడ క్లాసుకి వెళ్ళిపోయాను. అప్పటినుండి ఆవిడ నోటినుండీ వచ్చే ప్రబంధాలగురించి వింటూ తెలుగు అంటే పిచ్చి ఇష్టం పెంచుకున్నాను. మొన్నీమధ్య ఆవిడ గురువుగారు మద్రాసు యూనివర్శిటీలో ప్రొఫెసర్ బాలకృష్ణయ్యగారు ఫోన్ చేసి 'నువ్వు నాకు ప్రశిష్యురాలివమ్మా అంటే నా శిష్యురాలి శిష్యురాలివి నువ్వు పైకి రావడం నాకు ఆనందదాయకం అన్నారు.' గురువుగారి గురువుగారి దీవెన కన్నా గొప్పదీవెన ఏముంటుంది?

ఇంక తెలుగు రాసే రచయితల గురించి వస్తే, ఓ సారి మా ఇంటికో అబ్బాయి వచ్చి ఇంత లావు పుస్తకం తెరిచి, చాలా కవితలు చదువుతున్నాడు. సాధారణంగా 'తుమ్మెద ఝూంకారం, కోయిలమ్మ వలపు పాట, సెలయేటి ఊట' ఇలాంటి పదాలు చాలా దొర్లుతూ 'గులాబీల ఘుమఘుమలు' అని తాదాత్మ్యంగా చదువుతుండగా "ఏదీ ఓసారి ఇలా ఇవ్వు" అని ఆ పుస్తకం తీసుకుని తెరిచాను. అందులో తాటికాయంత అక్షరాల్లో **'గుల్లబీలు ఘుమ్మ ఘుమ్మలు'** అనే వాక్యం నాగుండెల్లో గులాబీ ముల్లులా దిగింది. ఇంకోసారి ఇలాగే, చాలా పేరెన్నికగన్న మాటల రచయిత, (పేరెందుకు కానీ) "కావ్య డల్‌గా ఉంది" అని చెప్పాడు. తీరా ఆ కాయితం అందుకుని చూస్తే **"కాంవ్య ఢంల్ల్‌గా ఉంది"** అని రాసాడు. అది ఎలా ఉచ్చరించాలో నాకు అర్ధంకాలేదు. కానీ ముప్ఫైనాలుగు సినిమాలకి డైలాగ్స్ రాసి పెద్ద

రచయితగా పేరుతెచ్చుకున్నాడులెండి. ఏ భాష సినిమా తియ్యాలన్నా ఆ భాష రావాలి. కానీ తెలుగు సినిమాకి ఆ నిబంధన లేదు. ఏ ఇతర భాషా డైరెక్టరైనా దర్శకత్వం చెయ్యొచ్చు. ఏ భాష రచయితైనా కథ ఇవ్వచ్చు. మనం చూసే చాలా తెలుగు సినిమాల్లో "అమ్మా నాకు ఇవాళ దోశ తినాలని ఆశగా ఉంది" అంటుంది హీరోయిన్. 'ఆశ' అన్న పదం మన తెలుగులో పెద్ద అర్థాన్ని సూచిస్తుంది. పిల్లలు ప్రయోజకులు అవ్వాలని ఆశపడడం, పెద్ద ఇల్లుకట్టుకోవాలని ఆశపడడంలాగా. కానీ తమిళులకి మనసుపడటం, కోరికపడటం లాంటి వాటికి ఆశ అని వాడడం అలవాటు. చివరికి "నాకు ఇవాళ కాలేజ్‌కి బస్ మీద వెళ్ళాలని ఆశగా ఉందిరా" అంటాడు హీరో. ఏది ఇష్టం? ఏది కోరిక? ఏది ఆశ? వీటికి మధ్య చాలా తేడాలున్నాయని రాసే రచయితలకి తెలీదు. తమిళ యాసతో "పక్కరోజు ఆ అమ్మాయి పిలిచింది" అని రాస్తారు. "పక్క రోజు" అంటే మర్నాడుట. "నాకు తెలుగు భాష అంటే అది వేరే ఇష్టం" అంటారు. "వేరే" అంటే మనం "అదికాకుండా" అని వాడే అర్థం. "నాకు తెలుగంటే అసలే ఇష్టం." అని చెప్పడానికి "అది వేరే" అని వాడతారు. భార్యని తమిళులు 'అమ్మా' అని సంబోధిస్తారు. అది చూసి మన తెలుగు సినిమాల్లో కూడా అడపా దడపా భార్యతో "అదికాదమ్మా.. చెప్పమ్మా" అని వాడేస్తుంటారు. "మాదిరి" అన్నపదం కూడా చాలా చోట్ల తెలుగులో వాడం. "అమ్మాయి కుందనపు బొమ్మలా ఉంది" అంటాంకాని "కుందనం బొమ్మ మాదిరి ఉంది" అనం. ఇవన్నీ పరభాషా పీడనాలు.

మొన్నామధ్య సిటీవిజన్ ఏంకర్ మనసులో ఇంగ్లీషులో మాట్లాడుకుంటూ, తెలుగులో నన్ను ఇంటర్వ్యూ చేసాక, "అయ్యో ఏమైపోతోంది మన తెలుగు?" అని తెగ బాధపడ్డాను. ఆ అమ్మాయి ఇంటర్వ్యూ అయ్యాక "తెలుగులో కూడా నావల్స్ ఉంటాయని ఇవాళ మీ వల్ల తెలిసింది మేడమ్" అన్నప్పుడు కందుకూరికీ, గురజాడకీ, మొక్కపాటికీ, నిన్నటి యద్దనపూడి, యండమూరి, మల్లాదిగార్లకీ ఈవిడ విషయం తెలిస్తే ఎంత భాధపడతారా అనిపించింది.

'ళ' అక్షరం పలకడం మానేసి పూర్తిగా దశాబ్దం అయింది. 'నీల్లూ.. కల్లూ, వాల్లూ.. వీల్లూ' అని మాట్లాడడమే మోడ్రన్‌గా మాట్లాడడం అని ఇప్పటి ఏంకర్స్ అభిప్రాయం. దీని గురించి డబ్బింగ్‌లో కూడా పట్టించుకోవడం లేదు. అక్కడ కూడా వీళ్ళ లాంటి అసిస్టెంట్ డైరెక్టరే ఉంటాడు అనుకుంటా. పాత వాళ్ళయితే నాలుక ఆకురాయికి అరగదీసైనా సరిగ్గా పలికించేవాళ్ళు.

కనీసం తల్లితండ్రులు పిల్లల భాషని సరిచేస్తే, వాళ్ళ చేత తాతగార్లకీ, అమ్మమ్మలకీ ఏడాదికో ఉత్తరం రాయిస్తే తెలుగులో ఈ జనరేషన్‌కి తెలుగులో అనుబంధం కొనసాగుతుంది.

ఇంతకీ ఎదురింటి ఆవిడ ఉగాది అంటే తెలుగు సంవత్సరాది అని చెప్పనందుకు ఈ బాధ మొదలయింది. ఫోన్‌లో సమాచారం తెలుగులో వినుటకి ఒకటిని నొక్కండి అనగానే ఆనందంగా నొక్కుతామా, మొత్తం సమాచారం గడగడా చెప్పి "మీ దినం శుభ్రంగా గడవాలని మా ఆశ" అంటారు. 'ఈ దినం' అన్న పదం దేనికి వాడాలో దేనికి వాడకూడదో ఎవరు చెప్తారు?

ఇంక సినిమాల పుణ్యమా అని "అంత సీన్ లేదు", "అమ్మాయి హాత్ ఇచ్చింది మామా"లాంటి మాటలు ఇంటింటా ప్రాచుర్యం పొంది, ఎనభై ఏళ్ళ ముసలమ్మకూడా వాడేస్తోంది. భాషకి ఓ గౌరవం, లాలిత్యం, పదాల పొందికా ఉండాలని మనకి తెలుసు. ఎందుకీ అన్యపద ప్రయాస?

కాసేపు "మనసున మల్లెలు మాలలూగెనే" అంటూ అచ్చమైన తెలుగుపాటలు వింటూ ఈ నందన నామ సంవత్సరాన్ని నందనవనం చేసుకుందాం.

***అందరికీ నందననామ శుభాకాంక్షలు.***

***సర్వేజనా సుఖినోభవంతు***

Click here to share your comments on this story.


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
బలభద్రపాత్రుని రమణి కాలమ్ దాటని కబుర్లు
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి